భారత్ శుభారంభం

10మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఫైనల్లో మనుభాకర్ • లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ జోడీ బోణీ • టీటీలో హర్మీత్‌దేశాయ్ ముందంజ

ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్ పోటీల తొలి రోజు భారత్ శుభారంభం చేసింది. కోట్లాది మంది అభిమానుల ఆశలు, ఆకాంక్షలు మోసుకుంటూ పారిస్ గడ్డపై అడుగుపెట్టిన భారత బృందం పతక సాధన దిశగా తొలి అడుగు వేసింది. శనివారం వేర్వేరు విభాగాల్లో మన అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. మహిళల 10మీటర్ల ఎయిర్‌పిస్టల్‌లో మను భాకర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. చెక్కుచెదరని గురితో ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ భాకర్ పతక వేటలో ముందంజ వేసింది. బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్‌తో పాటు సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీ బోణీ కొట్టారు. తమకంటే తక్కువ ర్యాంక్ ప్రత్యర్థులపై అలవోక విజయం సాధించారు. హాకీలో న్యూజిలాండ్‌పై భారత్ విజయదుందుభి మోగించింది. ఆఖర్లో హర్మన్‌ప్రీత్‌సింగ్ గోల్‌తో టీమ్‌ఇండియా గెలుపు వాకిట నిలిచింది.

పారిస్: కోటి ఆశలతో కొంగొత్త లక్ష్యాలతో పారిస్ ఒలింపిక్స్‌లో అడుగుపెట్టిన భారత అథ్లెట్లు పతక సాధన దిశగా దూసుకెళుతున్నారు. తమపై పెట్టుకున్న ఆశలను వమ్ముచేయకుండా ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ ముందుకు సాగుతున్నారు. శనివారం జరిగిన షూటింగ్ మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో స్టార్ షూటర్ మను భాకర్ సత్తా చాటింది. గత ఒలింపిక్స్‌లో ఘోరంగా నిరాశ పరిచిన మను ఈసారి ఎక్కడా తడబాటుకు లోనుకాకుండా లక్ష్యంపై గురిపెడుతూ పాయింట్లు కొల్లగొట్టింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 580 పాయింట్లు దక్కించుకున్న మను భాకర్ ఫైనల్ పోరుకు అర్హత సాధించింది. వైజే కిమ్(కొరియా), తర్హాన్(టర్కీ), జి లీ(చైనా)తో కలిసి భాకర్ ఫైనల్ పోరులో తలపడనుంది. ఆదివారం జరిగే తుదిపోరులో ఈ స్టార్ షూటర్ మెరిస్తే..ఒలింపిక్స్ షూటింగ్‌లో పతకం గెలిచిన తొలి భారత మహిళగా అరుదైన రికార్డు సొంతం చేసుకుంటుంది. మరోవైపు పురుషుల విభాగం క్వాలిఫికేషన్ రౌండ్‌లో సరబ్ జ్యోత్‌సింగ్ 577 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచి తృటిలో ఫైనల్ బెర్తు కోల్పోయాడు. మరోవైపు 10మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు నిరాశపరిచారు. అర్జున్ బబుతా-రమిత జోడీతో పాటు సందీప్‌సింగ్- ఎలావెనిల్ వాలరివన్ ద్వయం ఫైనల్ బెర్తు దక్కించుకోలేకపోయింది.

రెపిచేజ్‌లో పన్వర్: పురుషుల రోయింగ్ సింగిల్స్ స్కల్స్‌లో బల్‌రాజ్ పన్వర్ రెపిచేజ్ రౌండ్‌కు అర్హత సాధించాడు. మహిళల 54కిలోల తొలి రౌండ్‌లో భారత యువ బాక్సర్ ప్రీతి పవార్ 5-0 తేడాతో వో తి కిమ్ అన్హ్ (వియత్నాం)పై గెలిచింది.

మనుభాకర్

పతకాల పట్టిక

దే	స్వ	ర	కా	మొ
ఆస్ట్రేలియా	2	1	0	3
చైనా	2	0	0	2
బెల్జియం	1	0	1	2
జపాన్	1	0	1	2
కజకిస్థాన్	1	0	1	2
జర్మనీ	1	0	0	1

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

చైనాదే తొలి పసిడి

పారిస్ ఒలింపిక్స్‌లో చైనా పసిడి బోణీ కొట్టింది. పోటీల తొలి రోజైన శనివారం జరిగిన 10మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ద్వారా చైనా మొదటి స్వర్ణాన్ని ముద్దాడింది. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పసిడి పోరులో చైనా ద్వయం హువాంగ్ యటింగ్, షెంగ్ లివాహో 16-12తో కొరియా జంట కెయు జిహ్యూన్, పార్క్ హజున్‌పై అద్భుత విజయం సాధించారు. పాయింట్ పాయింట్‌కు ఇరు దేశాల షూటర్ల మధ్య ఆసక్తికర పోరు జరిగింది. అంతకముందు జరిగిన క్యాంస పోరులో అలెగ్జాండ్రా లె, స్టపయెవ్..కజకిస్థాన్‌కు తొలి పతకాన్ని అందించారు. మరోవైపు డైవింగ్‌లో చైనా మరో స్వర్ణాన్ని దక్కించుకుంది. దశాబ్దాలుగా డైవింగ్‌లో తమదైన ఆధిపత్యం కొనసాగిస్తున్న చైనా అదే అనవాయితీని కొనసాగించింది.

లక్ష్యసేన్ ముందంజ

బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ పోరులో యువ షట్లర్ లక్ష్యసేన్ 21-8, 22-20తో కెవిన్ కార్డన్ (గ్వాటెమాలా)పై అలవోక విజ యం సాధించాడు. టోక్యో ఒలింపిక్స్ సెమీఫైనలిస్టు అయిన కార్డన్‌పై లక్ష్యసేన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆది నుంచే జోరు కనబరుస్తూ వరుస గేముల్లో కార్డన్‌ను చిత్తుచేశాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీ 21-17, 21-14తో ఫ్రాన్స్ ద్వయం కార్వీ, లాబర్‌పై అలవోక గెలిచి ముం దంజ వేశారు. మహిళల డబుల్స్‌లో అశ్విని, తనీషా జోడీ పోరాటం ము గిసింది.

హాకీలో బోణీ

ఒలింపిక్స్ హాకీలో ఘన చరిత్రకు చిరునామా అయిన భారత్..పారిస్‌లో అదిరిపోయే ఆరంభం చేసింది. తమ తొలి పోరులో టీమ్‌ఇండియా 3-2తో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. భారత్ తరపున మన్‌దీప్‌సింగ్(24ని), వివేక్‌సాగర్(34ని), హర్మన్‌ప్రీత్‌సింగ్(59ని) గోల్స్ చేశారు. మరోవైపు సామ్‌లేన్(8ని), సైమన్ చైల్డ్(53ని) కివీస్‌కు గోల్స్ అందించారు. మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనగా దక్కిన పెనాల్టీ స్ట్రోక్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి భారత్‌కు విజయాన్నందించాడు.

హర్మీత్ అదుర్స్

పురుషుల టేబుల్‌టెన్నిస్‌లో హర్మీత్‌దేశాయ్ ఆకట్టుకున్నాడు. సింగిల్స్ పోరులో హర్మీత్ 11-7, 11-9, 11-5, 11-5తో జైద్ అమోయమన్(జోర్డాన్)పై ఘన విజయం సాధించాడు. పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో భారత ద్వయం బాలాజీ, రోహన్ బోపన్న పోరు ఆదివారానికి వాయిదా పడింది.

ఒలింపిక్స్ చచ్చిపోయింది!

ప్రారంభ వేడుకలపై నెటిజన్ల ట్రోలింగ్

చారిత్రక సీన్ నదిని వేదికగా చేసుకుంటూ సాగిన పారిస్ ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలపై విమర్శల జడివాన కురుస్తున్నది. తమదేశ ఘనమైన వారసత్వాన్ని చూపించే క్రమంలో ఫ్రాన్స్ నవ్వులపాలైంది. వెస్టన్ సివిలైజేషన్‌ను పూర్తిగా ఎగతాళి చేస్తూ రూపొందించిన డ్రాగ్-క్వీన్ థీమ్‌తో కూడిన కార్యక్రమంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో మ్యారీ అంటోనెటి తన తలను చేతిలో పట్టుకున్నట్లు కనిపిస్తున్న వీడియోతో పాటు విచిత్రమైన మేకప్, భారీ కాయం ఉన్న మహిళ ధరించిన దుస్తులు, లియోనార్డో డావిన్సి 'ద లాస్ట్ సప్పర్' వేషధారణ, ఏసు క్రీస్తుపై పేయింటింగ్‌పై నిర్వాహకులు..సోషల్ మీడియాలో భారీగా ట్రోలింగ్‌కు గురయ్యారు.

ఇదేం డిజైన్!

భారత ఒలింపిక్స్ డ్రెస్‌పై విసుర్లు

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభ కార్యక్రమంలో భారత అథ్లెట్లు ధరించిన దుస్తులపై సోషల్‌మీడియాలో విమర్శల జడివాన కురుస్తున్నది. సీన్ నదిపై బోట్‌పై భారత ప్లేయర్లు జాతీయ జెండాలు పట్టుకుని అభివాదం చేస్తున్న డ్రెస్‌ల డిజైన్‌పై పలువురు పెదవి విరుస్తున్నారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిల్యాని మూడు రంగుల జెండా డిజైన్‌తో ఇక్కత్‌తో రూపొందించాడు. అయితే ఇందుకు వాడిన దుస్తుల నాణ్యతపై పలువురు తరుణ్‌పై సోషల్‌మీడియాలో తమదైన శైలిలో అరుసుకున్నారు. దేశం దృష్టిని ఆకర్షించాల్సిన డిజైన్ ఇలా ఉంటుందా అంటూ ఒకరు ప్రశ్నించగా, అంబానీ పెండ్లికి చేసిన డిజైన్లతో పోల్చుకుంటే ఇవి చాలా ఆధ్వానంగా ఉన్నాయంటూ సూటిగా విమర్శించారు. ఇదే డ్రెస్ ముంబై రోడ్లపై 200లకు తెస్తానంటూ ఒకరు కామెంట్ చేశారు. అయితే తన డిజైన్‌పై తరుణ్ సమర్థించుకునే ప్రయత్నం చేశాడు.

24 కోట్ల జనాభా 7గురు అథ్లెట్లు

పారిస్‌లో పాకిస్థాన్ బృందంపై సెటైర్లు

పారిస్ ఒలింపిక్స్‌లో పోటీకి దిగిన పాకిస్థాన్ జట్టుపై జోకులు పేలుతున్నాయి. 24 కోట్ల జనాభా నుంచి బరిలో ఉన్నది ఏడుగురు అథ్లెట్లు అంటూ పలువురు సోషల్‌మీడియా వేదికగా సెటైర్లు వేస్తున్నారు. విశ్వక్రీడల కోసం పాకిస్థాన్ 18 మందితో కూడిన బృందాన్ని పారిస్‌కు పంపగా,అందులో ఏడుగురు ప్లేయర్లు కాగా మిగతా వారు అధికారులు కావడం విశేషం. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రారంభ కార్యక్రమంలో వ్యాఖ్యాత వ్యంగ్యంగా మాట్లాడుతూ '24 కోట్ల జనాభా కల్గిన పాకిస్థాన్ నుంచి ఏడుగురు అథ్లెట్లు మాత్రమే పాల్గొంటున్నారు' అని దెప్పిపొడిచాడు. ఈ వీడియోను పాక్ జర్నలిస్టులు సోషల్‌మీడియాలో షేర్ చేశారు.

భారత్ x శ్రీలంక

నేడు మహిళల ఆసియాకప్ ఫైనల్

దంబుల్లా: ఆసియాకప్‌లో టైటిల్ పోరుకు వేళయైంది. ఆదివారం డిఫెండింగ్ చాంపియన్ భారత్, ఆతిథ్య శ్రీలంక మధ్య ఫైనల్ ఫైట్ జరుగనుంది. ఓటమన్నదే ఎరుగకుండా టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమ్‌ఇండియా..ఫైనల్లోనూ అదే పునరావృతం చేయాలని చూస్తున్నది. రికార్డు స్థాయిలో ఇప్పటికే ఏడుసార్లు ఆసియా విజేతగా నిలిచిన భారత్..మరోమారు టైటిల్‌ను ఒడిసిపట్టుకోవాలని చూస్తున్నది. ఓపెనర్లు స్మృతి మందన, షెఫాలీవర్మ సూపర్ ఫామ్‌లో జట్టుకు బాగా కలిసిరానుంది. బౌలింగ్‌లోనూ రేణుకాసింగ్‌తో పాటు హైదరాబాదీ స్పీడ్‌స్టర్ అరుంధతిరెడ్డి..ప్రత్యర్థి బ్యాటర్లకు పరీక్ష పెడుతున్నారు. మరోవైపు టోర్నీలో అద్భుత ప్రదర్శనతో రాణిస్తున్న శ్రీలంక..సొంతగడ్డపై టైటిల్‌ను ఒడిసిపట్టుకోవాలని చూస్తున్నది. కెప్టెన్ చమరీ ఆటపట్టు 243 పరుగులతో టాప్‌స్కోరర్‌గా కొనసాగుతున్నది. బ్యాటింగ్ పరంగా బలంగా ఉన్నా..బౌలింగ్ బలహీనత లంకను దెబ్బతీసే అవకాశముంది.

పారా అథ్లెట్లకు ఎస్‌జేఏటీ చేయూత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వారం రోజులుగా ఉత్సాహంగా సాగుతున్న కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్(జేపీఎల్) శనివారం ముగిసింది. స్థానిక ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో టీవీ9 12 పరుగుల తేడాతో ఎన్టీవీపై ఉత్కంఠ విజయం సాధించింది. ఆఖరి వరకు ఇరు జట్లు గెలుపు కోసం హోరాహోరీగా తలపడ్డాయి. కిరణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్', జగదీశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కాయి. ముగింపు కార్యక్రమానికి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్, సహాయ కార్యదర్శి బసవరాజు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్ హాజరై విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, పతకాలు ప్రదానం చేశారు. మ్యాచ్ అనంతరం స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తెలంగాణ(ఎస్‌జేఏటీ) తరపున పది మంది దివ్యాంగ ప్లేయర్లకు నగదు ప్రోత్సాహ చెక్కు లు అందించారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్లు సంజయ్, భరత్ రెడ్డి, భరణి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య సూపర్ షో

- రాణించిన పరాగ్, అక్షర్, అర్ష్‌దీప్
- శ్రీలంకపై భారత్ ఘన విజయం

పల్లెకెలె(శ్రీలంక): సూర్యకుమార్, గౌతం గంభీర్ శకానికి అద్భుత ఆరంభం లభించింది. టీ20 ప్రపంచ చాంపియన్ హోదాలో భారత్..శ్రీలంకపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. శనివారం జరిగిన తొలి టీ20 పోరులో టీమ్‌ఇండియా 43 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 213/7 స్కోరు చేసింది. కొత్త కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (26 బం తుల్లో 58, 8ఫోర్లు, 2సిక్స్‌లు) , రిషబ్ పంత్ (33 బంతుల్లో 49, 6ఫోర్లు, సిక్స్), యశ్వి జైస్వాల్(21 బంతుల్లో 40, 5ఫోర్లు, 2సిక్స్‌లు) విజృంభించారు. ఓపెనర్లు జైస్వాల్, శుభ్‌మన్ గిల్(34) మెరుగైన శుభారంభాన్నిచ్చారు. రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ లేని లోటు కనిపించకుండా లంక బౌలర్లపై ఆది నుంచే బ్యాట్లు ఝుళిపించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే వీరిద్దరు బంతి తేడాతో నిష్క్రమించడంతో జట్టు ఒకింత ఒత్తిడిలోకి వెళ్లింది. ఈ తరుణంలో కెప్టెన్ సూర్యకుమార్, పంత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ముఖ్యంగా మిస్టర్ 360 తనదైన శైలిలో షాట్లు ఆడుతూ లంక బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. పిచ్‌పై బంతి పడటం ఆలస్యం స్టాండ్‌లోకి పంపిస్తూ స్కోరుబోర్డును పరిగెత్తించాడు. ఈ క్రమం లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. హార్దిక్ (9), పరాగ్(7), రింకూసింగ్(1) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. పతిరణ(4/40)నాలుగు వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన లంక 19.2 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. నిస్సనక(79), కుశాల్ మెండిస్ (45) ఆకట్టుకోగా, మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. పరాగ్ (3/5), అర్ష్‌దీప్‌సింగ్ (2/24), అక్షర్‌పటేల్ (2/38) రాణించారు. సూర్యకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో టీ20 పోరు జరుగనుంది.

సంక్షిప్త స్కోర్లు భారత్: 20 ఓవర్లలో 213/7(సూర్యకుమార్ 58, పంత్ 49, పతిరణ 4/40, హసరంగ 1/28), శ్రీలంక: 19.2 ఓవర్లలో 170 ఆలౌట్(నిస్సనక 79, మెండిస్ 45, పరాగ్ 3/5, అర్ష్‌దీప్‌సింగ్ 2/24)

16
అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు సూర్యకుమార్ ఖాతాలో ఉన్నాయి. కోహ్లీ(16), రజా(15) ఆ తర్వాత ఉన్నారు.

సూర్య (58)

ధనాధన్ అర్ధసెంచరీతో విజృంభణ

'కొన్ని బీర్లు శాకాహారం కాదు'

న్యూఢిల్లీ: బీర్, విస్కీ, బ్రాందీ..మొదలైనవి (ఆల్కహాల్) శాకాహారమా? మాంసాహారమా? అన్నదానిపై సందేహాలు పెరిగాయి. సాధారణంగా బార్లీ, గోధుమ, మొక్కజొన్న, బియ్యం, ద్రాక్ష సహా వివిధ రకాల పండ్ల నుంచి బేవెరెజెస్ కంపెనీలు మద్యాన్ని తయారుచేస్తున్నాయని అనుకుంటారు. అయితే, ఇది పూర్తి నిజం కాదని నివేదికలు హెచ్చరించాయి. కొన్ని రకాల బీర్లు శాకాహారం కాదని తేల్చాయి. జంతువుల నుంచి ఉత్పత్తి చేసిన ఐజిన్ గ్లాస్, జిలెటిన్ వంటి పదార్థాలను బీరు, వైన్‌లలో వాడుతున్నారని, ఆల్కహాల్ ఉత్పత్తుల తయారీ పద్ధతులపై శాకాహారులు ఆరా తీయాలని నివేదికలు హెచ్చరించాయి. జంతు ఉత్పత్తులతో తయారైన మద్యం వల్ల శాకాహారుల జీవన శైలి ప్రమాదంలో పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశాయి.

జోలెపట్టి భిక్షమెత్తిన కళాకారులు

వరంగల్ చౌరస్తా: ఎన్నికల ప్రచారంలో మూడు నెలల్లో ఉద్యోగాలిస్తామని మాటిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదని కళాకారులు భిక్షమెత్తి నిరసన తెలిపారు. శనివారం సకల కళాసాంస్కృతిక మండలి, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఐక్యవేదిక, వారసత్వ కళల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని రైల్వే స్టేషన్ జంక్షన్ నుంచి ఎంజీఎం సర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపులా కరపత్రాలు పంచుతూ.. పాటలు పాడుతూ జోలెపట్టి భిక్షమెత్తారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. 'ఒడ్డెక్కే వరకు ఓడ మల్లన్న ఒడ్డెక్కినాక బోడ మల్లన్న' అన్నట్టుంది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీరని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హత ఉన్న కళాకారులకు టీఎస్ఎస్ ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు అనుసరిస్తున్న విధంగా కళాకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంతో బాధపడుతున్న కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సకల కళాసాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు బిర్రు సురేందర్, వారసత్వ కళల సంరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్‌కే రాజు, కళాకారులు పాల్గొన్నారు.

వేతనాలివ్వాలని ఇరిగేషన్ కార్మికుల ధర్నా

ఖలీల్‌వాడి: ఐదు నెలలైనా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకంలో పనిచేసే కార్మికులు 20 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అయినా అధికారులు, కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో జిల్లా లేబర్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చెప్తే వినలేదని జుట్టు కత్తిరించిన టీచర్

పెనుబల్లి: జుట్టు పెంచుకొని పాఠశాలకు వస్తున్నారంటూ ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు శిరీష విద్యార్థుల జట్టు కత్తిరించిన ఘటన శనివారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ జడ్పీహెచ్ఎస్‌లో చోటుచేసుకుంది. పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఇలా చేయడం ఏమిటని, అవమానభారంతో పిల్లలు ఏమైనా చేసుకుంటే ఎవరు బాధ్యత వహించాలని తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఉపాధ్యాయురాలు చేసిన నిర్వాకానికి తమ పిల్లలకు పూర్తిగా గుండు కొట్టించాల్సి వచ్చిందని తల్లిదండ్రులు చెప్పారు. విషయం తెలుసుకున్న డీఈవో సోమశేఖర శర్మ సదరు ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేశారు.

ఆరో రోజుకు చేరిన నేతన్నల దీక్షలు

రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నేతన్నలు చేపట్టిన రిలే దీక్షలు శనివారంతో ఆరో రోజుకు చేరాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన దీక్షలను శనివారం పాలిస్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దూడం రమేశ్ ప్రారంభించారు. దీక్షలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఉడుత రవి, జిందం మహేశ్, మరిపెద్ది ప్రభాకర్, జిందం రవి, చందుపట్ల పోశమల్లు, బొచ్చు రాంచంద్రం, మంగళారపు లక్ష్మీనారాయణ, జిందం దేవదాస్ పాల్గొన్నారు.

సారు లేని సర్కారు బడి

మరికల్: నారాయణపేట జిల్లా మరికల్ మండలం జీబండ తండాలోని సర్కారు బడి సారు లేకుండా కొనసాగుతున్నది. గతంలో ఈ పాఠశాలలో విద్యార్థులు లేకపోయినా.. కేసీఆర్ ప్రభుత్వం ఉపాధ్యాయుడు రవీంద్ర నాయక్‌ను నియమించింది. రవీంద్రనాయక్ విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి 13 మందిని పాఠశాలలో చేర్పించారు. ఇటీవల బదిలీలో రవీంద్రనాయక్ పదోన్నతిపై వెళ్లారు. దీంతో పాఠశాల మూతపడే పరిస్థితి ఉంది. రాధిక అనే టీచర్ బదిలీపై జీబండ కు వచ్చినా.. ఆమె పాత స్కూల్‌లో రిలీవ్ కాలేదు. విద్యార్థులు పాఠశాలకు వచ్చి ఖాళీగా కూర్చొని వెళ్లిపోతున్నారు. శనివారం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు వచ్చి గతంలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను చదువుకున్నారు. సీఆర్పీ శివను సంప్రదించగా.. ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో సమస్య నెలకొన్నదని చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.